కనిపించే శవాలు!

టెంపోరావ్

హోరున వర్షం కురుస్తోంది. ఒంటరిగా ఆమె మేడమీది గదిలో కూర్చుంది. ఫ్లోరసెంట్ లైట్ వెలుగుతోంది. కిటికీలోంచి ఆమె బయటకు చూస్తోంది. రోడ్డమ్మట ఎవరో వెళ్తున్నారు.

మెరుపు ఆకాశంలో తళుక్కుమంది. భయంకరంగా ఉరిమింది! ఆమె కిటికీ దగ్గరనుంచి వెనక్కి పోదామనుకుంది కాని, అదే క్షణంలో ఎదుటింటి కింది గదిలోని లైటు వెలిగింది. ఆమె ఆ గదివైపు చూస్తూ కూర్చుంది.

కిటికీ తలుపులు తెరిచివున్నాయి. ఒకతను యెవర్నో మోసుకొచ్చి కుర్చీలో పడేశాడు. అతను వేగంగా వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు.

ఆమె కుర్చీవైపు తీక్షణంగా చూసింది. కుర్చీలో కూర్చున్న మనిషిని చూసి ఉలిక్కిపడింది!

లైటు కాంతిలో అతను స్పష్టంగా కనిపిస్తున్నాడు. అతని బట్టలనిండా రక్తం! అతని తల కాలివైపుకు వాలి వుంది! అతని అవయవాలు కదలడంలేదు. అతను మరణించి వుండాలి!

ఆమె ఎదుటి గదివైపే చూస్తోంది! అతడిని మోసుకొచ్చి నతను గదిలోకొచ్చాడు. అతను నలువైపూ చూశాడు. తెరిచివున్న కిటికీవైపు చూశాడతను. గబగబా కిటికీ ముందుకొచ్చాడు.

కిటికీలోంచి క్షణకాలం ఆమెకేసి చూశాడతను.

అతడిని చూసి ఆమె ఉలిక్కిపడింది. అతను చటుక్కున కిటికీ తలుపులు మూసేశాడు. ఆమెకు అటుపైన ఏమీ కనిపించలేదు!

అతను తనని చూశాడు. తనకోసం వస్తాడేమో! ఆమె కిందకు పరుగెత్తింది. వీధి తలుపు గడియ పెట్టివుందని ఆమె నిర్ధారణ చేసుకుని పైకి వెళ్ళింది.

కిటికీలోంచి మళ్ళా బయటకు చూసింది.

ఆకాశాన్ని మెరుపు చీల్చింది! ఒళ్ళు జలదరించేటట్లు ఉరిమింది. ఎక్కడో పిడుగు పడుండాలి!

చటుక్కున లైట్లు ఆరిపోయాయి. గదిలో చీకటి. నలువైపులా అంధకారం! మళ్ళా యెలక్ట్రిసిటీ యెప్పుడొస్తుందో?

కిటికీ ముందు చీకట్లో ఆమె అలాగే కూర్చుంది. వర్షం జోరుగా కురుస్తూనే వుంది. తన భర్త యింకా రాలేదు!

తన రేడియమ్ డైల్ వాచ్ ని చూసిందామె. టైము

పది దాటింది. ఆమె భర్త సివిల్ యింజనీర్. పొద్దుటే వర్క్ స్పాట్‌కి పోతాడతను. రాత్రి పది తర్వాత యింటికొస్తాడు! అంతవరకూ ఆమె ఒంటరిగా వుండవలసిందే!

ఆమెకు పెళ్ళయి మూడేళ్ళయింది. భర్త గోపీనాథ్ రెండునెలల క్రితం యీ మేడను కొన్నాడు. అంతకు ముందు వాళ్ళు ఒక అద్దె ఇంట్లో వుండేవాళ్ళు.

కారు హారన్ వినపడింది. హారన్ని ఆమె వెంటనే గుర్తు పట్టింది. భర్త వస్తున్నాడు. టార్చి కాంతిలో చూసుకుంటూ ఆమె కిందకు వెళ్ళింది. తలుపు దగ్గర నిలబడింది. తలుపు తీసే ధైర్యం లేదామెకు!

ఎవరో తలుపును తట్టారు. "రాధా, నేను!" అన్నాడు భర్త.

ఆమె తలుపు తెరిచింది. తటాలున అతను లోపలికొచ్చాడు. టార్చిలైటు పట్టుకొన్న ఆమెకేసి చూశాడు

"లైటు పోయి ఎంతసేపయింది?"

"అరగంట దాటింది," అందామె.

అతను లైట్ స్విచ్ నొక్కాడు. కాస్సేపట్లో లైట్ వెలిగింది.

గోపీనాథ్ ఆమెకేసి నవ్వుతూ చూశాడు. ఆమె సంతోషంగా లేదు. మొహంలో భయం గోచరిస్తోంది.

దగ్గరగా వెళ్ళి అతనామెను చేతుల్తో చుట్టేశాడు. "రాధా, ఏమిటలా వున్నావు?" అడిగాడతను.

"ఒంటరిగా నేనింత పెద్దింట్లో వుండలేను!" అందామె.

"మనకు పిల్లలు పుడితే యీ యిల్లు అంత పెద్దదిగా కనిపించదు!" అన్నాడతను.

ఆమె మాట్లాడలేదు. ముందు తలుపును లోపలనుంచి మూసింది. ఇద్దరూ మేడమీదున్న పడగ్గదిలోకి వెళ్ళారు.

ఆమె కిటికీలోంచి ఎదుటింటివైపు చూస్తూ వుండి పోయింది!

గోపీనాథ్ సూట్ తీసేశాడు. లుంగీ కట్టుకున్నాడు. సూట్‌ను బీరువాలో దాచేశాడు. ఆమెదగ్గరకు వెళ్ళాడు.

"రాధా, ఏమిటలా చూస్తున్నావు?" అడిగాడతను.

ఆమె త్రుళ్ళిపడింది. అతనామెను గట్టిగా పట్టుకున్నాడు. వర్షం ఆగింది. చినుకులు పడుతున్నాయి.

అతనామెను తీసుకెళ్ళి సోఫాలో కూర్చోబెట్టి, పక్కనే కూర్చున్నాడు.

ఆమెకేసి నవ్వుతూ చూశాడు.

"రాధా!" అన్నాడతను.

ఆమె భర్తవైపు సూటిగా చూసింది.

"ఎదుటింట్లో హత్య జరిగింది!" అందామె.

"నీకెలా తెలుసు?"

"నేను శవాన్ని చూశాను. అతని దుస్తుల నిండా రక్తం. అతని మెడ కుడివైపుకు వాలిపోయింది. అతనిలో జీవం లేదు. హంతకుడు నన్ను చూసి కిటికీతలుపులు మూసేశాడు," అందామె.

ఆమె చెప్పింది విని అతను ఆశ్చర్యపోయాడు.

"హంతకు డెవరు?" అడిగాడతను.

"ఎదుటింట్లో ఎవరుంటున్నారు?"

"కర్నల్ కామత్."

"అతనే హంతకుడు!" అందామె.

"రాధా, కామత్ చాలా మంచివాడని విన్నాను.

అతను ఆర్మీలో ఆఫీసర్. పిల్లా జల్లా లేరు. భార్య అతడిని వదిలేసింది. పూర్ మేన్, ఒంటరిగా జీవిస్తున్నాడు!" అన్నాడతను.

ఆమె మాట్లాడలేదు. భర్త వైపు సీరియస్‌గా చూసింది. "కామత్ ఎలా వుంటాడు?" అందామె.

"పొడుగ్గా, లావుగా వుంటాడు. కళ్ళజోడుంటుంది. ఎప్పుడూ టిప్‌టాప్‌గా సూట్‌లో వుంటాడు. అతడిని దూరంనుంచి చూశాను. అతనితో నాకు పరిచయంలేదు," అన్నాడతను.

"అతనే శవాన్ని మోసుకొచ్చి కుర్చీలో పడేశాడు. అతనే నావైపు చూసి కిటికీ తలుపులను మూసేశాడు," అందామె.

గోపీనాథ్ ఆశ్చర్యంతో విన్నాడు. సిగరెట్ వెలిగించి పొగ వదులుతూ ఆమెకేసి చూశాడు. ఆమె పెదిమలు వణుకుతున్నాయి.

"అతను నన్ను చంపుతాడు!" అందామె.

"నాన్‌సెన్స్!" అన్నాడతను.

"హంతకుడు సాక్షుల్ని బతకనివ్వడు. నేనంతా చూశాను. నేను బతికుంటే అతనికి ప్రమాదం. అందువలన నన్ను చంపడానికి తప్పక ప్రయత్నిస్తాడు," అందామె.

"రాధా, నువ్వు భయపడకు. నీకేమీ అవదు!"

"మీరు పొద్దుట వెళ్ళి రాత్రి పది దాటిందాకా రారు! నేనీ మేడలో ఒంటరిగా వుంటాను. ఒంటరి స్త్రీని అతను సులువుగా చంపగలడు!"

గోపీనాథ్ ఆమెను కౌగలించుకున్నాడు. ఆమె పెదిమలను ముద్దెట్టుకున్నాడు.

"రాధా, నేను ఆఫీసుకు సెలవు పెట్టలేను. నేను సెలవుపెడ్తే అక్కడ పని సాగదు. డిటెక్టివ్ పరశురామ్ గారికి ఫోన్ చేసి మాట్లాడతాను. ఆయన నీకు ప్రమాదం లేకుండా చూస్తారు," అన్నాడతను.

2

టెలిఫోన్ మ్రోగింది. రిసీవరెత్తాను. "హలో, పరశురామ్!" అన్నాను.

"పరశురామ్‌గారూ, నేను గోపీనాథ్‌ని," అన్నాడతను.

"హలో మిస్టర్ గోపీనాథ్, ఏమిటి సంగతి?"

"మా యెదురింట్లో ఏదో హత్య జరిగిందట. నా భార్య రాధ శవాన్ని చూసింది. హంతకుడు తనని చంపుతాడని ఆమె భయపడ్తోంది! హంతకుడు ఆమెను చూశాడట!" అన్నాడు గోపీనాథ్.

"మిస్టర్ గోపీనాథ్, నేనక్కడకు వచ్చి మాట్లాడతాను" అని రిసీవర్ని పెట్టేశాను.

టైమ్ చూశాను. పదిన్నర అయింది.

పక్కన కూర్చున్న పార్వతి నావైపు నవ్వుతూ చూసింది. "వడ్డించనా?" అందామె.

"అర్జంటు పనుంది. తిరిగొచ్చాక భోజనం చేస్తాను," అని బయటకు పరుగెత్తాను.

డాడ్జి కారును స్పీడుగా పోనిస్తున్నాను. చినుకులు పడ్తున్నాయి. నార్త్ యీస్ట్ మాన్‌సూన్ ప్రారంభమైంది. వర్షం కురుస్తూనే వుంటుంది!

ఆలివర్ స్ట్రీట్ వైపు కారును తిప్పాను. గోపీనాథ్ గృహప్రవేశానికి వెళ్ళాను. అతని మేడను పోల్చగల్గాను.

కారును లోపలకు పోనిచ్చి ఆపి, దిగాను.

గోపీనాథ్ నవ్వుతూ నన్ను ఆహ్వానించాడు. అతనితో హాల్లోకి వెళ్ళాను. సోఫాలో కూర్చున్నాను. నా యెదురుగా రాధ కూర్చునివుంది. ఆమె కేసి నవ్వుతూ చూశాను.

"ఏమైందో చెప్పండి!" అన్నాను.

గోపీనాథ్ ఆమెపక్కనే కూర్చున్నాడు. భయపడ్తూ ఆమె నాకంతా చెప్పింది.

"మీరు చెప్పింది నిజమైతే ఆ యింట్లో శవం వుండాలి!" అన్నాను.

"ఎడం వైపున్న కింద గదిలో వుంది. నేనా గది వైపు చూస్తూనే వున్నాను. శవాన్ని బయటకు తీసుకెళ్ళలేదు," అందామె.

"పరశురాం గారూ, రోజల్లా నేను ఇంట్లో వుండను. తనకు ప్రమాదం వస్తుందని నా భార్య భయపడ్తోంది. ఆమెకు ఏ ఆపదా రాకుండా చూడ్డానికి మీ రెవరినేనా నియమించాలి," అన్నాడు గోపీనాథ్.

అతని వైపు చూశాను.

"ఆమె భయపడనక్కరలేదు. నానమ్మినబంటు కబీర్ని యింటి ముందు కాపలాగా ఉండమంటాను," అన్నాను.

"థాంక్స్, సార్. పరశురామ్‌గారు ఎదురింట్లో వుండే కర్నల్ కామత్ తిక్క మనిషి. నా భార్య ఏదో శవాన్ని చూసినట్లు మీరతనితో చెపితే ప్రమాదం. అది నిజం కాకపోతే అతను మమ్మల్ని పీడిస్తాడు," అన్నాడు గోపీనాథ్.

నవ్వుతూ సోఫాలోంచి లేచాను.

"అతనితో నేను మాట్లాడుతాను. మీ పేర్లు నా సంభాషణలో రావు!" అన్నాను.

"మిస్టర్ పరశురామ్, స్కాచ్ విస్కీ తీసుకుందాం. కాస్సేపు కూర్చోండి," అన్నాడతను.

కుర్చీలో చతికిల బడ్డాను. గోపీనాథ్ చాలా కాలంగా నాకు తెలుసు! అతను పేరు గాంచిన సివిల్ యింజనీర్! రాధ లోపలకు వెళ్ళి తిరిగొచ్చింది. టీపాయి మీద స్కాచ్ విస్కీ బాటిల్నూ, రెండు గ్లాసులనూ పెట్టింది. రిఫ్రిజిరేటర్ లోంచి చల్లటి సోడాలను అతను తెచ్చాడు.
రాధ మౌనంగా కూర్చుంది. రెండు గ్లాసుల్లో అతను విస్కీ పోసి, సోడా కలిపాడు. ఇద్దరం గ్లాసులను అందు కున్నాం. విస్కీ తాగి అతని వైపు చూశాను.
"ఫైన్ విస్కీ!" అన్నాను.
"ఇది మా దుబాయ్ బ్రాంచి నుంచి వచ్చింది," అన్నాడతను.

గోపీనాథ్ పెద్ద కంపెనీలో పని చేస్తున్నాడు. అతని కంపెనీ పెర్షియన్ గల్ఫ ప్రాంతంలో ఎన్నో కాంట్రాక్టు లను నిర్వహిస్తోంది.

గ్లాసు ఖాళీ అయింది. అతను మళ్లా పోయబోయాడు. వద్దని సోఫాలోంచి లేచాను. అతను నాతో కారుదాకా వచ్చాడు. జేబులోంచి నోట్లకట్టతీసి నా కిచ్చాడు. "పరశురామ్‌గారూ, పదివేలు! నా భార్యకు ఏ ఆపదా రాకుండా చూడండి," అన్నాడతను.

"మీరు ఆమెకు ధైర్యానివ్వండి. ఆమెకు ప్రమాదం రాదు. ఈ రాత్రే కబీర్ని ఇక్కడకు పంపుతాను," అని కారులో కూర్చుని తలుపులు మూశాను. అతనికి గుడ్ నైట్ చెప్పి కారును పోనిచ్చాను.
కారు గేటు దాటింది. ఎదురుగా వున్న యింటి ముందు

కారును ఆపి దిగాను. మెయిన్ గేటు మూసి వుంది. గేటుకి లోపల వైపు తాళం వేసివుంది.

గేటు ఎక్కి అటువైపుకు దూకాను. వరండా మీదకు వెళ్ళి ముందు తలుపుమీద తట్టాను.

చుట్టూ చీకటిగా వుంది. కొంతసేపయ్యాక తలుపు తెరవబడింది. హాల్లో లైట్ వెల్గుతోంది. వరండా లైటు కూడా వెల్గింది.

"హాలో, ఎవరు మీరు?" అన్నాడతను.

కర్నల్ కామత్! అతని వైపు చూటిగా చూశాను. అతని వయస్సు అరవై ఏళ్ళుండొచ్చు! మనిషి వృద్ధుడిలా కనపడ్డంలేదు. అతను పాంటు, స్లాక్లో వున్నాడు. కాళ్ళకు బూట్లు వున్నాయి. పొడుగైన మనిషి. కళ్ళకు గ్లాసెస్ వున్నాయి.

నా పేరు చెప్పాను. అతను వులిక్కి పడ్డాడు.

"రండి, మిస్టర్ పరశురామ్," అన్నాడతను.

గదిలోకి వెళ్ళాను. విశాలమైన హాలు. గదిలో రెండు ఫ్లోరసెంట్ లైట్లు వెల్గుతున్నాయి. ఖరీదైన సోఫాలున్నాయి. అతను నన్ను కూర్చోమన్నాడు. శవం వున్న గది హాలుకు ఎడం వైపున వుండాలి.

సోఫాలో కూర్చుని సిగరెట్ వెలిగించాను. అతనికి సిగరెట్ యిస్తే తీసుకోలేదు. అతనివైపు పరీక్షగా చూశాను. కామత్ ది బట్టతల. అతని కళ్ళు తాగుడులో ఎర్రబడినాయి.

"మీరు యీ యింట్లో ఒంటరిగా వున్నారా?" అడిగాడు.

"యస్," అన్నాడు క్లుప్తంగా.

"ఈ యిల్లు మీదేనా?"

"రిటైరైనాక కొన్నాను," అన్నాడతను.

"ఫైన్ హౌస్," అన్నాను, నలువైపులా చూస్తూ.

"మిస్టర్ పరశురామ్, ఇల్లు చూడండి," అని అతను లేచాడు.

అతనితో కూడా వెళ్లాను. కింద గదులన్నీ చూసి మెట్లెక్కి పైకి వెళ్ళాం. మేడ మీదున్న గదులన్నీ చూశాను. రాధ చూసిన శవం ఎక్కడా లేదు. మంచాల కిందకు వంగి చూశాను. రాధ భ్రమపడిందేమో!

ఇద్దరం కింద హాల్లోకి తిరిగొచ్చాం. కర్నల్ కామత్ తన బ్రాండ్ బ్రిస్టల్ సిగరెట్ వెలిగించాడు. అతను నావైపు సూటిగా చూశాడు.

"ఇంత రాత్రివేళ ప్రత్యేకమైన పని ఏదో వుంటేగాని మీరు రారు! ఏం పనిమీదొచ్చారో చెప్పండి," అన్నాడతను.

తీయగా నవ్వాను.

"కర్నల్, మీరు ఏదేనా ఉద్యోగంలో చేర్తారా?"

"ఏదేనా వుందా?"

"మీరు ఒప్పుకుంటే వుంటుంది!"

అతను భుజాలు ఎగరేశాడు. నావైపు కళ్ళు చిట్లించి చూశాడు.

"మిస్టర్ పరశురామ్, నా కెవ్వరూ లేరు. నా దగ్గర చాలా డబ్బుంది. ఇంకా గడించడం వృథా ఏమో!"

"అది మీరు నిర్ణయించుకోవాలి!" అన్నాను.

"జాబ్ ఏమిటో చెప్పండి."

"నా ఫ్రెండు ఫ్యాక్టరీ నడుపుతున్నాడు. అతనికి

సెక్యూరిటీ చీఫ్ కావాలి! రాత్రిళ్ళు మీరా ఫ్యాక్టరీలో వుండాలి!" అన్నాను.

"నో ప్లీజ్! రాత్రిళ్ళు నిద్రలేకుండా నేనుండదల్చుకో లేదు. పగలు పనైతే చేస్తాను," అన్నాడతను.

"నైట్ డ్యూటీ అన్నాడతను. ఫ్రెండ్ తో చెప్తాను," అని సోఫాలోంచి లేచాను.

చటుక్కున చెయ్యి చాచాను. అతనితో కరచాలనం చేశాను. అతని చెయ్యి చెమటతో తడిగావుంది!

కర్నల్ కామత్ ఎందుకో భయపడ్తున్నాడు! అతడి తడి చేతులు, మొహం నాలో అనుమానాన్ని పుట్టించాయి.

"వెళ్తున్నా, గుడ్ నైట్," అన్నాను.

"మీరు గేటుదాకి వచ్చినట్లున్నారు. అదే విధంగా వెళ్ళగలరనుకుంటాను" అన్నాడతను.

"ష్యూర్," అంటూ బయటకు కదిలాను.

అతను ముందు వరండా మీద కొచ్చి నిలబడ్డాడు. గేటెక్కి రోడ్డువైపు దూకాను. క్షణకాలం వెనుదిరిగి అతనివైపు చూశాను. అతను రాతి విగ్రహంలా నిల బడ్డాడు. కారులో కూర్చుని తలుపు మూశాను.

గోపీనాథ్ మేడవైపు చూశాను. పైన లైట్లు వెలు తున్నాయి. కిటికీల దగ్గర ఎవ్వరూ లేరు. కారును ముందుకు పోనిచ్చాను.

3

పార్వతి నాకోసం ఎదురు చూస్తూ కూర్చుంది. ఆమెను కౌగలించుకొని, పెదిమలను ముద్దెట్టుకున్నాను. "స్వీట్ గర్ల్, పద భోజనం చేద్దాం!" అన్నాను.

ఆమె కిందకు వెళ్ళింది, రిసీవరెత్తి కబీర్ నంబరు తిప్పాను.

"హాలో కబీర్ స్పీకింగ్!" అన్నాడతను.

"పరశురామ్ హియర్," అన్నాను.

"చెప్పండి సార్."

"కబీర్, ఆలివర్ రోడ్డు, నెంబర్ 11 ఇల్లు. ఆయింట్లో ఇంజనీర్ గోపీనాథ్, అతని భార్య రాధ వుంటున్నారు. అతను పొద్దుటే పనికి పోయి రాత్రి ఆలస్యంగా యింటికొస్తాడు. రాధ ఒంటరిగా ఇంట్లో వుంటుంది. ఆమె ఇంటి ప్రాంతంలో నువ్వు కాపలా వుండాలి. ఆమెకు ఏ ప్రమాదం రాకుండా చూడాలి," అన్నాను.

"ఆమెకు ప్రమాదం ఎవరి నుంచి రావచ్చు సార్?" అడిగాడు కబీర్.

"ఇంటి కెదురుగా కర్నల్ కామత్ వుంటున్నాడు. వాచ్ హిమ్!" అన్నాను.

"అలాగే సార్! అతడిని వెంటాడమంటారా?"

"వద్దు! నీకు ముఖ్యమైనది రాధ! ఆ ప్రాంతంలో వుండి అతడిని గురించి వీలైనది తెల్సుకోవాలి. ఎప్పుడూ ఆమెను వదిలి పోవద్దు," అన్నాను.

"అలాగే సార్."

"ఏదేనా జరిగితే నాకు ఫోన్ చేయి!"

"యస్సార్," అన్నాడు కబీర్.

అతనికి గుడ్ లక్ చెప్పి రిసీవర్ని పెట్టేశాను.

డైనింగ్ హాల్లోకి వెళ్ళాను. ఏర్ కండిషండ్ డైనింగ్ హాలు. పార్వతి ఎదురుగా కూర్చున్నాను. ఫ్లోరసెంట్ లైట్లు వెల్గుతున్నాయి. పార్వతి వైపు నవ్వుతూ చూశాను.

"మీ ఫావరిట్ కూర! ధనియాల మసాలా బంగాళా దుంపల కూర!" అందామె.

"భోజనం అనడానికి బదులు ఈ కూర పేరు మొదట చెప్పంటే తొందరగా వచ్చేవాడిని," అన్నాను.

"కందిపప్పు పచ్చడండి. పప్పుపులుసు!" అందామె.

"రియల్ ఫీస్ట్!" అన్నాను, తినడం ప్రారంభిస్తూ.

కృష్ణయ్య లోపల కొచ్చాడు. మరి కొంత కూర నా కంచంలో వేశాడు. కూరని మెచ్చుకుంటూ కృష్ణయ్య వైపు నవ్వుతూ చూశాను. కృష్ణయ్య గ్రేట్ కుక్!!

4

మర్నాడు పొద్దుట గోపీనాథ్ ఇంటికి కారున్న పోని చ్చాను. కబీర్ ఇంటి ప్రాంతంలో నాకు కనిపించాడు. అతనిని చూచి నవ్వాను.

గేటు మూసివుంది. డ్రాడ్జి కారును ఆపి, దిగి లోపలకు వెళ్ళాను. వరండా మీదకు వెళ్ళి ముందు తలుపును తట్టాను. గోపీనాథ్ కారు లేదు.

తలుపు తెరిచి ఆమె నాకేసి చూచింది.

"ఆయన యివాళ ప్రొద్దుటే వెళ్ళిపోయారు!" అందామె.

ముందు గదిలోకి వెళ్ళి ఆమెను కూర్చోమన్నాను. "మీతో మాట్లాడాలి!" అన్నాను.

ఆమె సోఫాలో కూర్చుంది. రాత్రి ఆమె నిద్రపోలే దని కళ్ళు చూస్తే తెలుస్తోంది!

"నిన్న రాత్రి అతనింటికి వెళ్ళాను. కర్నల్ కామత్‌తో మాట్లాడాను. శవం వుందని మీరన్న గదీ, తతిమ్మా గదులు చూశాను. ఎక్కడా శవం లేదు!" అన్నాను.

"ఎక్కడో దాచేసి వుంటాడు!" అందామె.

"మంచాల కింద కూడా చూశాను!"

"పరశురామ్‌గారూ! అది పెద్ద ఇల్లు. దాచడానికి అనేక రహస్య స్థలాలుంటాయి."

"శవాల నెవరూ యింట్లో దాచుకోరు. కుళ్ళు వాసన నలువైపులా కొడుతుంది! ఎక్కడో వాటిని పాతేస్తారు!"

"పాతేశాడేమో!"

"నే వెళ్ళేముందు అతనంత పని చేసుండలేదు! రాత్రి పన్నెండు తర్వాత అతను చేసుండొచ్చు! మీరు ఏదేనా చూశారా?" అడిగాను.

"రాత్రంతా అతనింటి వైపు చూస్తూనే జాగారం చేశాను. కాని అతను బయటికి రాలేదు. ఇంటి వెనుక వైపు అతనేదేనా చేస్తే నాకు కనిపించదు!" అందామె.

ఇండియాకింగ్స్ సిగరెట్ వెలిగించాను. పొగ వదుల్తూ ఆమెకేసి చూశాను.

"మీరు కాపలా వుంచిన కబీర్ ఇంటి ముందు పచార్లు చేస్తూనే వున్నారు," అందామె.

"అతడిని చూశాక మీకు ధైర్యంగా వుందా?"

ఆమె తలాడించింది.

"పరశురామ్‌గారూ! అటువంటి దృశ్యాన్ని మళ్ళా చూడనని ఆశిస్తున్నాను! మరోసారి చూస్తే యీ ఇంట్లో వుండలేను!" అందామె.

"మీరీ ఇంటికొచ్చి నెల అయిందనుకుంటాను!"

"అవును!" అందామె.

"అంతకుముందు యీ ఇల్లెవరిది?"

"నరసింగరావుగారిది. వాళ్ళు జవహార్ నగర్ లో

కొత్తిల్లు కట్టించుకుని అక్కడకు పోయారు!'' అందామె.

''ఫిలిం ప్రొడ్యూసర్ నరసింగరావా?'' ప్రశ్నించాను.

ఆమె తలాడించింది.

ఆమెవైపు సూటిగా చూశాను.

''కొంతకాలంపాటు మీ అమ్మనో, మరెవర్నో మీ ఇంట్లో వుంచుకోవడం మంచిది. ఒంటరిగా కూర్చుంటే చూసినదాన్ని గురించే మీరు ఆలోచిస్తూవుంటారు.'' అన్నాను.

''అమ్మకి రాస్తాను.'' అందామె.

సోఫాలోంచి లేచాను.

''అవుసరమైతే కబీర్ని పిలవండి. అతను చాలా మంచి వాడు, ధైర్యం గలవాడు. అతడిని గురించి మీరు భయపడ నక్కరలేదు.'' అన్నాను.

''అలాగే సార్!'' అందామె.

గదిలోనుంచి బయటకొచ్చాను. ఇంటి చుట్టూ తిరిగి చూశాను. పాత మేడ. చుట్టూ ప్రహరీ గోడుంది. వెనక వైపున నుయ్యి వుంది. నూతినీళ్లు మొక్కలకు వాడుతున్నారు.

నలువైపులా చెట్లూ, మొక్కలూ వున్నాయి. డజను అరటిచెట్లు నూతికి సమీపంలో కనిపించాయి.

గేటువైపు నడిచాను.

కారులో కూర్చుని తలుపు మూశాను. కబీర్ కారు పక్కకొచ్చాడు.

కబీర్తో మాట్లాడుతూ కర్నల్ కామత్ ఇంటివైపు చూస్తున్నాను. మేడమీదున్న గది కిటికీకి తెరలున్నాయి. తెరల వెనకనుంచి ఒక ఆకారం మమ్మల్ని గమనిస్తోంది. కారును పోనిచ్చాను.

5

గోపీనాథ్ తొమ్మిదింటికల్లా ఇంటికొచ్చేశాడు. భార్య ఎలా వుందో అని అతని గాభరా!

రాధ ఉషారుగా వుంది. ఒక ఉత్తరాన్ని అతనికి చూపించిందామె.

"అనూరాధ నా చిన్ననాటి స్నేహితురాలు. హైస్కూల్లో ఇద్దరం కలిసి చదువుకున్నాం," అంది రాధ.

"రాధా! ఇటుపైన కొంతకాలంపాటు నువ్వు ఒంటరిగా వుండనక్కరలేదు. ఆమె నీకు తోడుగా వుంటుంది," అన్నాడు భర్త.

ఏదో ఇంటర్వ్యూకి తన్ని పిల్చారనీ, తను మద్రాస్ వస్తున్నాననీ, అభ్యంతరం లేకపోతే ఇంట్లో అతిథిగా వుంటాననీ రాసింది వుత్తరంలో అనూరాధ.

రాధ ఇద్దరికీ వడ్డించింది. డైనింగ్ హాల్లో గోపీనాథ్, రాధ ఎదురుగా కూర్చుని భోజనం చేస్తున్నారు.

"మీరు వెళ్ళాక పరశురామ్‌గారొచ్చారు!" అందామె.

"ఎనీ న్యూస్?"

పరశురామ్ చెప్పినదంతా ఆమె భర్తకు చెప్పింది. అతను సూటిగా భార్యవైపు చూశాడు.

"రాధా! కర్నల్ కామత్ మీద నువ్వు హత్యా నేరాన్ని మోపుతున్నావు! అది నిజం కాకపోతే నువ్వూ, నీతో నేనూ చిక్కుల్లో పడ్తాం!"

"నేను శవాన్ని చూశాను!" అందామె.

"ఎలాగైనా మనం వెనకాముందూ ఆలోచించాలి! హత్యానేరం చిన్న నేరం కాదు!" అన్నాడతను.

భోజనం చేసి అతను మేడమీదకు వెళ్ళాడు.

ఆమె ముందుతలుపు గడియలు బిగించి, లైట్లు తీసేసి పైకి వెళ్ళింది.

గోపీనాథ్ ఒక టేబుల్ ముందు కుర్చీలో కూర్చుని, సిగరెట్ పీలుస్తూ ఏవో బ్లూప్రింట్లను చూస్తున్నాడు. వెనక్కి వెళ్ళి ఆమె నిలబడింది. అతను వెనుదిరిగిచూశాడు.

"ఇవి పరీక్షించి నేనొస్తాను. నువ్వెళ్ళి పడుకో!" అన్నాడతను.

ఆమె కిటికీ దగ్గరకు చేరంది. కాస్సేపయ్యాక గోపీనాథ్ ఆమెకేసి చూశాడు.

"రాధా! అటువైపు చూడకు! వెళ్ళి పడుకో!" అన్నాడతను.

ఆమె వెళ్ళి పరుపుమీద వాలింది. కళ్ళు మూసుకుంది. నిద్రపట్టక ఇటూ అటూ దొర్లుతూ వుండిపోయింది. గోపీనాథ్ తన పనిలో లీనమైపోయాడు.

ఎప్పుడో ఆమెకు నిద్రపట్టేసింది. ఏదో కేక విని ఆమె ఉలిక్కిపడి లేచింది. పక్కన పడుకొన్న గోపీనాథ్ మేలుకున్నాడు.

"భయంకరమైన కేక వినడింది!" అందామె.

"నేను వినలేదు!" అన్నాడతను.

అతనామె చెయ్యి పట్టుకున్నాడు.

"రాధా! నీ అరపు విని నేను లేచాను!" అన్నాడతను.

"నేనరవలేదు! ఆ కేక మీకు వినపడివుంటుంది!"

అతను లేచి కిటికీ దగ్గరకు వెళ్ళి ముందున్న రోడ్డును పరికించాడు. కబీర్ కోసం చూశాడు. అతనెక్కడా కనపడలేదు!

గోపీనాథ్ వెనక్కి తిరిగాడు. రాధవైపు చూశాడు.

"రాధా! కబీర్ ఏమైనాడు?"

"ఆయనే అర్చారేమో!"

"వెళ్ళి చూసిరానా?"

"వద్దు! మీరు వెళ్ళొద్దు! పరశురామ్‌గారికి ఫోన్ చేయండి! ఆయన చూస్తారు!" అందామె.

"రాధా! నేనొక పిరికిపందనని పరశురామ్‌గారు అనుకుంటారు! వెళ్ళి చూస్తాను!" అని అతను కిందకు పరుగెత్తాడు. గోపీనాథ్ గేటువైపు నడిచాడు. అతని చేతిలో టార్చిలైటుంది. అతను రోడ్డుమీదకు చేరుకున్నాడు.

రోడ్డు వారగా కబీర్ పడున్నాడు. అతని తలనుంచి రక్తం కారోంది. అతను మెలుకువగా లేడు. అది చూసి గోపీనాథ్ వేగంగా లోపలకు పరుగెత్తుకొచ్చాడు. హాల్లోని టెలిఫోన్ దగ్గరకెళ్ళి, రిసీవరెత్తి, ఒక నంబరు తిప్పాడు.

పైనుంచి రాధ గబగబా వచ్చి, ముందుతలుపు మూసి గడియలు పెట్టింది! రాధ చాలా భయపడ్తోందని అతను గ్రహించాడు!

6

గోపీనాథ్ ఇంటిముందు డాడ్జి కారు ఆపి దిగాను.

గోపీనాథ్ నా దగ్గరకొచ్చాడు. కబీర్ని పరీక్షగా చూశాను. కర్రతో ఎవరో అతడిని బుర్రమీద కొట్టారు. కబీర్ని ఎత్తి, మోసుకెళ్ళి కారు వెనుక సీటుమీద కూర్చోబెట్టాను.

సిగరెట్ వెలిగించి, పొగ వదుల్తూ గోపీనాథ్‌వైపు చూశాను.

"మిస్టర్ గోపీనాథ్! తలుపులు జాగ్రత్తగా మూసుకు పడుకోండి! నేనితనిని హాస్పిటల్లో చేర్చి మళ్ళా ఈపక్క-

కొస్తాను. బి కేర్‌ఫుల్!'' అన్నాను.

''అలాగే మిస్టర్ పరశురామ్!'' అన్నాడతను.

''నేనుండగానే మీరు లోపలకు వెళ్ళండి!'' అన్నాను.

అతను వెళ్ళిపోయాడు. ముందు సీటుమీద కూర్చుని తలుపు మూశాను. సిగరెట్ పీలుస్తూ కాస్సేపు అలాగే కూర్చున్నాను. రోడ్డుమ్మట జనసంచారం లేదు. కర్నల్ కామత్ మేడవైపు చూశాను. ఎక్కడా లైట్లు లేవు!

కారును ముందుకు పోనిచ్చాను. రాయపేట హాస్పిటల్లో కబీర్ని చేర్చాను. జాగ్రత్తగా అతడిని చూడమని డాక్టర్ సుందరంతో చెప్పాను.

డాడ్జి కారును వెనక్కి పోనిచ్చాను. గోపీనాథ్ ఇంటి ముందు కారాపి దిగాను. రోడ్డుమ్మట ఇటూ అటూ పచార్లు చేస్తున్నాను!

ఒకతను ఎదురుగా వస్తున్నాడు. ఖాకీ దుస్తుల్లో వున్నాడతను. చేతిలో లాఠీ వుంది. అతనివైపు నడిచాను. నన్ను చూసి అతను ఆగాడు.

''ఎవరు నువ్వు?'' అడిగాను.

''వాచ్‌మన్ సార్!'' అన్నాడతను.

''ఇక్కడ తిరగడానికి ఎవరు నిన్ను నియమించారు?''

''నేనే తిరుగుతున్నాను. ప్రతి ఇంటివాళ్ళూ ఒక రూపాయి యిస్తారు!'' అన్నాడతను.

''ఈ రోడ్డుమీదే తిరుగుతావా?''

''జీ సాబ్!'' అన్నాడతను.

ఆ గూర్ఖా! నేపాల్ నుంచి వచ్చాడు. ఉద్యోగాలు దొరకక నైట్ వాచ్‌మన్‌గా పనిచేసి, ఇళ్ళవాళ్ళు ఇచ్చే దానితో జీవిస్తూవుంటాడు!

అతడిని పోనిచ్చాను. వెళ్ళి కార్లో కూర్చున్నాను, సిగరెట్ పీలుస్తూ.

రెండు గంటలు అలా వాచ్ చేసి తిరిగి కారును పోనిచ్చాను.

రాయపేట హాస్పిటల్ కాంపౌండులో కారును ఆపాను. దిగి డాక్టర్ సుందరం గదిలోకి వెళ్ళాను. అతను నవ్వుతూ నన్ను కబీర్ గదిలోకి తీసుకెళ్ళాడు.

"నో డేంజర్, మిస్టర్ పరశురామ్!" అన్నాడు డాక్టర్.

కబీర్ నవ్వుతూ నావైపు చూశాడు. అతని తలమీద బాండేజి వుంది!

"కబీర్, ఏమైంది?" అడిగాను.

"ఎవరో తలమీద కర్రతో కొట్టారు. కళ్ళు తిరిగాయి. బుర్ర దిమ్మెక్కినట్లయింది. కింద పడిపోయాను!" అన్నాడతను.

"ఎవరు?" ప్రశ్నించాను.

"నేను చూడలేదు సార్!" అన్నాడతను.

"ఇదెక్కడ జరిగింది?"

"పదిహేనో నంబరు ఇంటినుంచి వెనక్కి తిరిగి వస్తున్నాను. పన్నెండో నంబరు ఇల్లు ప్రాంతంలో ఎవరో కొట్టారు."

"కర్నల్ కామత్ కొట్టివుంటాడా?"

"చెప్పలేను సార్!" అన్నాడు కబీర్.

అతను లేచి కూర్చున్నాడు.

"మీతో నేనూ వస్తాను సార్! ఐయామ్ ఆల్ రైట్!" అన్నాడతను.

డాక్టర్ సుందరంవైపు చూశాను.

"అతను రేపు వెళ్ళడం మంచిది!" అన్నాడు డాక్టర్.

"థాంక్ యూ డాక్టర్!" అని బయటకు నడిచాను.

7

రాధ స్టేషన్‌కి వెళ్ళి అనూరాధను ఇంటికి తీసుకొచ్చింది. భర్త కారు పంపాడు. వాళ్ళను ఇంట్లో దింపేసి కారు వెళ్ళిపోయింది.

అనూరాధ వయసు ఇరవై నాలుగుంటుంది. రాధకంటె కొద్దిగా పెద్దది.

ఎన్నో వింతలూ, విశేషాలు చెప్పుకుంటూ ఇద్దరూ కాఫీ తాగారు. అనూరాధ స్నానం చేస్తూంటే రాధ స్టూల్ వేసుకొని బాత్‌రూమ్‌లో కూర్చుంది. ఇద్దరూ మాట్లాడుకుంటూ వుండగా, అనూరాధ స్నానం చేసింది. భోజనం చేస్తూ యిద్దరూ ఎంతో చెప్పుకున్నారు.

భోజనాలయాక వాళ్ళు పైనున్న పడగ్గదిలోకి వెళ్లారు. ఒకే పరుపుపైన వాళ్ళు పడుకున్నారు. అనూరాధ రాధను కౌగిలించుకుంది!

"నీ జీవిత మెలా వుంది చెప్పు!" అందామె.

"ఆయన బాగా డబ్బు గడిస్తున్నారు. ఈ ఇల్లు కొన్నారు. కాని నాతో తిరగడానికి ఆయనకు టైమ్ దొరకదు! ఆయనకి పనితోనే సరిపోతుంది!" అంది రాధ.

"రాధా! డోంట్ బాదర్! ఎండగా వున్నప్పుడే బట్టలు ఆరేయాలి! అలాగే వచ్చే సమయంలోనే డబ్బును రాబట్టుకోవాలి! మనం కావాలన్నప్పుడు డబ్బు రాదు!" అంది అనూరాధ.

అటుపైన తను చూపిన శవాన్ని గురించి చెప్పింది రాధ.

అనూరాధ ఆమె చెప్పింది విని ఆశ్చర్యపోయింది. ఆమె కిటికీ దగ్గరకెళ్ళి ఎదుటి ఇంటివైపు చూసింది. ఇంట్లో ఎవ్వరూ లేనట్లు వుంది!

"దయ్యాల కొంపలా వుంది!" అంది అనూరాధ.

"ఒకప్పుడు ఈ ఇల్లు కూడా దయ్యాల కొంపట! ఇంట్లోవాళ్ళందరూ వెళ్ళిపోయారు, తాళంవేసి. రెండేళ్లు అలా పడుంది. ఎవ్వరూ వుండేవారు కారట! తర్వాత నరసింగరావుగారు కొన్నారట! ఇదంతా పాలు పోసేది పొద్దుట నాతో చెప్పింది!" అంది రాధ.

"మనుషులలాగే ఇళ్ళకు గత చరిత్రలుంటాయి. అంతా తెలుసుకొన్నాక ఇళ్ళు కొనాలి!" అంది అనూరాధ.

"ఆయనకు తొందరెక్కువ! ఇల్లు నచ్చిందని వెంటనే అడ్వాన్స్ యిచ్చేశారు" అంది రాధ.

ప్రయాణబడలికతో అనూరాధ నిద్రపోయింది.

రాధకు ఇంటిముందు తిరుగుతున్న కబీర్ కనిపించాడు. ఆమె వేగంగా కిందికెళ్ళింది. ముందు వరండాలో నిలబడి చేత్తో కబీర్‌కి సౌంజ్ఞ చేసింది. గేటు తెరిచి అతను ఆమె ముందుకొచ్చాడు. అతని తలమీద కట్టుంది.

"నిన్న రాత్రి మిమ్మల్ని ఎవరు కొట్టారు?" అందామె.

"త్వరలో కనుక్కుంటాను!" అన్నాడతను.

ఆమె ఆశ్చర్యపోయింది. ఆమె ఆలోచిస్తోంది. తను శవాన్ని చూసింది. అటుపైన కబీర్ ఇంటిముందు పచార్లు చేస్తున్నాడు. హంతకుడు భయపడి కబీర్ని కొట్టివుండాలి! ఆమె గాభరాగా కబీర్ వైపు చూసింది.

"మీరు భయపడకండి. మీకే ప్రమాదం రాదు!" అన్నాడు కబీర్.

"మిమ్మల్నే కొట్టిన మనిషి నన్ను వదుల్తాడా?" అందామె.

"వాడొక పిరికిపంద! వెనకనుంచి వచ్చి కొట్టి పారిపోయాడు! ఇవాళో, రేపో వాడికి బుద్ధి చెప్తాను." అని కబీర్ గేటువైపు వెళ్ళిపోయాడు.

రాధ లోపలకు వెళ్ళి తలుపు మూసింది. హాల్లో నిలబడి నలువైపులా చూసింది. ఎందుకో ఆమెకు భయమేసింది. ఆమె గబగబా మెట్లమ్మట పైకి వెళ్ళింది. అనూరాధ ప్రక్కనే పడుకుంది. అనూరాధ గాఢనిద్రలో వుంది!

టెలిఫోన్ మ్రోగింది.

రాధ టెలిఫోన్ దగ్గరకెళ్ళింది. ఆమె శరీరం వణుకుతోంది. రిసీవర్ని ఎత్తింది.

"హాలో!" అందామె.

"రాధా! అనూరాధ వచ్చిందని డ్రైవర్ చెప్పాడు. ఇప్పుడు భయం లేకుండా వున్నావా?" అడిగాడు గోపీనాధ్.

"భయం లేదు!" అందామె.

"ఇవాళ నేను ఆలస్యంగా వస్తాను" అన్నాడతను.

"అలాగే!"

"స్వీట్ గర్ల్! బైబై!" అని అతను రిసీవర్ని పెట్టేశాడు.

ఆమె రిసీవర్ని పెట్టేసి కిటికీ దగ్గరకు వెళ్ళింది. కర్నల్ కామత్ గేటు బయటకొచ్చి క్షణకాలం ఆమెవైపు చూశాడు. గబగబా రోడ్డమ్మట వెళ్ళిపోయాడు. అతనివైపు ఆమె చూస్తూ వుండిపోయింది!

కర్నల్ కామత్ కిరాతకుడిలా కనిపించాడామెకు!

కబీర్ ఇంటిముందునుంచి వెళ్ళాడు. కర్నల్ కామత్ వెళ్ళినవైపు నడుస్తున్నాడతను!

అది పట్టపగలు కాబట్టి వాళ్ళు పోట్లాడుకోరు. ఆమె మెదడులో ఏవేవో ఆలోచనలు సాగుతున్నాయి!

"రాధా!"

ఆమె పిలుపు విని వెనక్కి తిరిగింది. అనూరాధ పరుపు మీద కూర్చునివుంది.

"రాధా! ఈ ఇంట్లో నిద్రపట్టటంలేదు. ఎందువల్లనో? ఏవో దుష్టశక్తులు చుట్టూ తిరుగుతున్నాయి అనిపిస్తోంది!" అంది అనూరాధ.

రాధ ఆమె దగ్గరగా కూర్చుంది. ఆమె చెయ్యి పట్టుకుంది.

"నువ్వు చెప్పింది నాకూ నిజమనిపిస్తోంది!" అంది రాధ.

మూడింటికి అనూరాధ చక్కటి చీర కట్టుకుని, మేకప్ చేసుకుని తన పనిమీద వెళ్ళడానికి సిద్ధమైంది.

"రాధా! నువ్వు రాకూడదూ? పదింటికి వచ్చేస్తాం!" అందామె.

"వద్దు. ఎవరో ఒకరు ఇంట్లో వుండాలి!" అంది రాధ.

"ఒక త్తెవ్రూ ఉండగలవా?"

"ఉండక తప్పదు!" అంది రాధ.

అనూరాధ హేండ్ బాగ్ పట్టుకుని వెళ్ళిపోయింది.

రాధ గడియవేసి పైకి వెళ్ళిపోయింది. కిటికీలోంచి బయటకు చూసింది. కబీర్ తిరుగుతున్నాడు. కర్నల్ కామత్ యింకా ఇంటికి వచ్చివుండడు!

8

రాధ పరుపుమీద పడుకుంది. కళ్ళు మూసుకుంది. తను చూసిన శవం...గాయపడిన కబీర్...చుట్టూ దుష్టశక్తు

లున్నాయన్న అనూరాధ...ఇదంతా రాధకు జ్ఞాపక మొస్తోంది! ఆమె గుండె దడదడ కొట్టుకుంటోంది!

ఆమె లేచి గాడ్రెజ్ బీరువాను తెర్చింది. స్కాచ్ విస్కీ బాటిల్ను, ఒక గ్లాసును తీసి టీపాయ్‌మీద పెట్టింది. రెఫ్రిజిరేటర్‌లోంచి రెండు సోడాలను తీసింది. పరుపుమీద కూర్చుని గ్లాసులో విస్కీ పోసి సోడా కలిపింది.

కొద్దిగా తాగింది. ఘాటుగా వుంది. కళ్ళు మూసుకుని మందులా గడగడ తాగేసింది. సోడా తక్కువగా పోయడంవలన గొంతు మండింది.

రాధ మళ్ళీ కిటికీ దగ్గరకు వెళ్ళింది. రోడ్డువైపు చూసింది. కర్నల్ కామత్ లోపలకు వస్తున్నాడు.

కబీర్ గేటు ముందునుంచి వెళ్తున్నాడు.

ఆమె పరుపుమీద కూర్చుని ట్రాన్సిస్టర్‌ని ఆన్ చేసింది. పాప్ మ్యూజిక్ వినబడ్తోంది. ఒక యువతి పాడ్తోంది. ఆమె పాదాల్తో తాళం వేస్తోంది!

లైఫ్ యీస్ రిస్కీ
విత్ ఎ పెగ్ ఆఫ్ విస్కీ
ఇటీస్ ఆల్ ఫన్
యూ రాక్ అండ్ రన్!

రాధకు తాగాక ఉషారుగా వుంది. మరో పెగ్ విస్కీని ఆమె తాగేసింది.

ట్రాన్సిస్టర్‌లోంచి పాట వినపడుతోంది. ఆమె పరుపు మీద వాలింది. కళ్ళు మూసుకుపోయాయి. ఆమె మత్తుతో నిద్రపోయింది.

ఆమె పదింటికి లేచింది. గదిలో లైటు వెల్గుతోంది.

నిషాగా వుంది. ఆమె కిటికీ దగ్గరకెళ్ళింది. ఎదురింటివైపు చూసింది, ఎడంవైపు గదిలో లైటు వెల్గుతోంది!

కుర్చీమీద ఒక స్త్రీ కూర్చునివుంది! ఆమెకు తలలేదు! ఆమె ధరించిన తెల్లచీర, జాకెట్ రక్తంతో ఎర్రబడ్డాయి! కబీర్ గేటు ముందునుంచి వెళ్తున్నాడు. మూర్ఖుడు! అలా తిరగడం లాభించదు. ఆ స్త్రీ శవం అతనికి కనపడదు! ఆమె అటువైపే చూస్తోంది. అతను గదిలోకొచ్చాడు. ఆమె తల అతని చేతిలో వుంది!

అతను కిటికీ దగ్గర కొచ్చి ఆమెకేసి చూశాడు. వెంటనే తలుపులను మూసేశాడు.

రాధ వెనక్కి వచ్చి పరుపుమీద కూర్చుంది. వేగంగా గ్లాసులో విస్కీ పోసుకుని సోడా కలిపింది. గ్లాసులోని విస్కీ గడగడ తాగేసింది.

ఎదుటింట్లో జరిగే హత్యలను తను ఆపాలి! ఆమె కిందకు పరుగెత్తి వీధి తలుపు తెరిచింది! అటువైపు నున్న మనిషిని చూసి వులిక్కిపడింది!

అనూరాధ!

"నువ్వా!" అంది రాధ.

"తలుపు తట్టేముందే తెరిచావు! నేను రావడం పైనుంచి చూశావనుకున్నాను," అందామె.

"అనూ, మరో హత్య! అతను ఒక స్త్రీని నరికేశాడు!" అర్చింది రాధ.

రాధ తూల్తోంది. రాధ మాట ముద్దగా వస్తోంది!

"రాధా, పైకి పద! ఏం చెయ్యాలో ఆలోచిద్దాం," అంది అనూరాధ.

రాధను ఆమె పైకి తీసుకుపోయింది. ఇద్దరూ పరుపుపై

కూర్చున్నారు. ట్రాన్సిస్టరులోంచి ఏదో ఉపన్యాసం విన పడ్తోంది. అనూరాధ ట్రాన్సిస్టర్‌ను ఆఫ్ చేసింది.

టీపాయి మీదున్న విస్కీ బాటిల్నీ, గ్లాసును, సోడా బుడ్లనూ ఆమె నవ్వుతూ చూచింది.

"రాధా, బాగా విస్కీ కొట్టేశావ్!" అందామె.

"జాయిన్ మి!" అంది రాధ.

"మొదట ఏం చూశావో చెప్పు!"

తను చూసినదంతా ఆమె వర్ణించింది. అనూరాధ కిటికీ దగ్గర కెళ్ళి తిరిగి వచ్చింది.

"తలుపు మూసివుంది!"

రాధ గ్లాసులో విస్కీ పోసి సోడా కలిపింది.

"అనూ, తాగు!" అందామె.

"విస్కీ అలవాటు నాకొద్దు. నువ్వు తాగు!" అందామె.

రాధ గ్లాసులోని విస్కీని తాగేసింది. హుషారుగా వుంది.

"అనూ, ఎదుటింటి మీదప దాడి చేద్దామా?" అడిగింది రాధ.

"డేంజరస్! ఒక స్త్రీని చంపిన వాడు ఎందర్నైనా చంపేస్తాడు. మనం అక్కడికి వెళ్ళొద్దు!"

"అయితే ఏం చేద్దాం?"

"ఈ యిల్లు ఎవరికేనా అద్దెకిచ్చేసి మరో ఇల్లు చూసుకోండి!" అంది అనూరాధ.

"ఆయనొచ్చాక చెప్తాను," అంది రాధ.

గోపీనాథ్ వచ్చేసరికి పన్నెండయింది. అతను నవ్వుతూ రాధ దగ్గర వెళ్ళాడు. కళ్ళు చిట్లించి అతని వైపు చూసిం

దామె. టీపాయి మీదున్న గ్లాసులో విస్కీపోసి, కొద్దిగా సోడా కలిపి తాగేశాడతను.

"మీ శ్రీమతి మంచి డోస్‌లో వుంది!" అంది అనూరాధ.

"రాధ నేనిచ్చినా తాగేది కాదు. ఇవాళ తాగడం విచిత్రంగా వుంది," అన్నాడతను,

"నాకు భయంగా వుంది. మరో హత్య చూశాను. ఆమెను నరికేశాడు. ఆమె తల అతని చేతిలో వుంది!" అంది రాధ.

"రాధా డోంట్ వర్రీ! నేను నీపక్కనున్నాను. నీ ఫ్రెండ్ అనూరాధ వుంది. రోడ్డుమీద కబీరు తిరుగుతున్నాడు! నీకేం భయం లేదు," అన్నాడతను, ఆమెను సమాధానపరుస్తూ.

9

నా ఫ్రెండ్ మేజర్ జనరల్ పృథ్వీరాజుతో రెండు గంటలపాటు కూర్చున్నాను. అతడిని కల్సుకుని సంవత్సరం దాటింది. అతను నన్ను ఒకంతట వదల్లేదు. విస్కీ తాగుతూ అనేక విషయాల గురించి మాట్లాడాం.

అక్కడ నుంచి తిరిగొస్తూ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు వెళ్ళాను. ఇన్‌స్పెక్టర్ నాయర్‌తో గంటపైగా మాట్లాడుతూ కూర్చున్నాను.

అక్కడ నుంచి హిందూ ఆఫీసుకు వెళ్ళి అక్కడ పని ముగించుకుని ఇంటి కొచ్చాను.

రెండింటికి మస్తుగా భోజనం చేసి పడుకున్నాను. నేను లేచేసరికి సూర్యుడు అస్తమించాడు. లైట్లు వెల్గుతున్నాయి.

మొహం కడుక్కుని వంటవాడు కృష్ణయ్య తెచ్చిన టిఫిన్ తిని నాలుగు కప్పుల కాఫీ తాగాను.

ఏర్ కండిషండ్ హాల్లో కూర్చుని స్కాచ్ విస్కీ తాగుతూ నేను కొని తెచ్చిన హిందూ పాత పత్రికలను చూస్తున్నాను.

టెలిఫోన్ మ్రోగింది.

వెళ్ళి రిసీవర్ని ఎత్తాను.

"హలో, పరశురామ్!" అన్నాను.

"నేను గోపీనాథ్‌ని సార్. నా భార్య ఇవాళ అదే యింట్లో మరోహత్య చూసింది," అన్నాడతను.

అతని భార్య చూసినదంతా వివరంగా చెప్పాడు.

"విచిత్రంగా ఉంది!" అన్నాను.

"పరశురామ్ గారూ, ఈ యింటి కొచ్చినప్పటి నుంచీ రాధ సంతోషంగా లేదు. ఎవరికేనా అద్దెకిచ్చి మరో చోటుకు పోదాం అనుకుంటున్నాను," అన్నాడతను.

"గుడ్ ఐడియా!" అన్నాను. ఆ తర్వాత కొద్దిసేపు మాట్లాడి ఫోన్ పెట్టేశాను.

10

కబీర్ నా ఎదురుగా కూర్చున్నాడు. అతని వైపు నవ్వుతూ చూశాను.

"గోపీనాథ్ గారు మరో యింటికి మారిపోయారు. సామానంతా పైన బెట్టి తాళం వేసి కింద భాగాన్ని ఒక బొంబాయి సేట్‌కి అద్దెకిచ్చేశారు. సేట్ ఇవాళ తన కుటుంబంతో సహా యింట్లోకి ప్రవేశించాడు," అన్నాడు కబీర్.

"సేట్‌కి పిల్లలున్నారా?"

"లేరు. అతనూ, భార్యా," అన్నాడు కబీర్.

సరిగ్గా పదింటికి అతనూ, నేనూ కిందకు వెళ్ళాం. డ్రాడ్జి కారులో అతను ముందు సీటు మీద కూర్చున్నాడు. కారును శరవేగంగా పోనిచ్చాను.

గోపీనాథ్ ఇంటి చివర రోడ్డు వారగా కారును ఆపి దిగాను. కబీర్ నా దగ్గరకు వచ్చాడు.

ప్రహారీ గోడ దూకి కాంపౌండులోకి చేరుకున్నాం. ఇంట్లో ఎక్కడా లైట్లు లేవు. ఆకాశంలో చంద్రుడు లేడు. ఎటు చూసినా అంధకారంగా వుంది.

మెల్లిగా అడుగులేస్తున్నాను. కబీర్ నా వెనకనే వస్తున్నాడు. వెనుక నున్న నూతి దగ్గరకు చేరుకున్నాం. ఎటు చూసినా చీకటి. ఏదో చప్పుడు వినిపిస్తోంది.

చటుక్కున టార్చి వెలిగింది. ఒకతను గునపంతో తవ్వుతున్నాడు. టార్చి మరొకళ్ళ చేతిలో వుంది!

కబీర్ ముందుకు వెళ్ళబోయాడు. అతని చెయ్యి పట్టుకుని ఆపాను. తొందర పడొద్దని చెవులో చెప్పాను.

టార్చి ఆరిపోయింది. గునపంతో తవ్వుతూన్న చప్పుడు మాకు వినపడ్తోంది. మెల్లిగా కదిలాను. మొక్కల పక్క నుంచి వెళ్ళాను. తవ్వే మనిషి ఆకారం కనపడ్తోంది.

"నాగూ, ఇంకా లోతుగా తవ్వి చూడు!" అందొక స్త్రీ కంఠం.

"టార్చి వెయ్యి!" అన్నాడతను.

ఆమె ఆన్ చేసింది. కబీర్ మెడమీద తట్టాను. ఇద్దరం అమాంతంగా వాళ్ళవైపు దూకాం. గునపంతో తవ్వుతున్న తడ్ని నేను బంధించి పట్టుకున్నాను. కబీర్ ఆమెను పట్టుకుని టార్చి లాక్కున్నాడు.

టార్చి కాంతి గునపం పట్టుకున్నతనివైపు పడింది.

నన్ను గుర్తుపట్టి అతను ఉలిక్కిపడ్డాడు.

"కర్నల్ కామత్ ఉరఫ్ నాగూ!" అన్నాను.

అతను గునపాన్ని ఎత్తబోయాడు. అతని మెడమీద చేత్తో బలంగా కొట్టాను. అతను ముందుకు పడ్డాడు. ఇంటి చుట్టూవున్న లైట్లు వెలిగాయి.

ఇన్‌స్పెక్టర్ నాయర్, పదిమంది కానిస్టేబుల్స్‌తో మా దగ్గరకొచ్చాడు. నేలమీద పడిన నాగూ లేచాడు. ఇద్దరు కానిస్టేబుల్స్ అతడిని చుట్టేశారు.

"నాయర్ భాయ్, కానిస్టేబుల్సును యిక్కడ తవ్వి చూడమను! భారత్ బాంకిలోంచి పోయిన పదిలక్షలు మనకు దొరకొచ్చు," అన్నాను.

ఒక కానిస్టేబుల్ పెట్రోమాక్స్ లైట్‌ను తెచ్చి మా సమీపంలో వుంచాడు.

నాగూకీ, అతనితోడా వున్న అతని ప్రియురాలికి ఇన్‌స్పెక్టర్ నాయర్ సంకెళ్ళు వేశాడు.

సిగరెట్ వెలిగించి, పొగ వదుల్తూ మేడ ముందువైపుకు వెళ్ళాను. మెయిన్‌గేటు తెరిచివుంది. అంబాసిడర్ కారొచ్చి యింటి ముందు ఆగింది. గోపీనాథ్, రాధ, అనూరాధ కిందకు దిగారు.

"వెల్‌కమ్ టు యువర్ హోమ్!" అన్నాను నవ్వుతూ.

ఇంటి వెనకవైపునుంచి వచ్చి ఒక కానిస్టేబుల్ ముందుతలుపు తెరిచాడు.

హాల్లోకి వెళ్ళి సోఫాలో చతికిలబడ్డాను. గోపీనాథ్ ఫాన్ తిప్పి నా పక్కనే కూర్చున్నాడు. రాధ, అనూరాధ అతని పక్కనున్న సోఫాల్లో కూర్చున్నారు.

ఇన్‌స్పెక్టర్ నాయర్ గబగబా లోపలికొచ్చాడు.

"బ్రదర్, యూ ఆర్ రైట్. పెద్ద ట్రంకుపెట్టె దొరికింది. వాళ్ళు తెస్తున్నారు," అన్నాడతను.

ఇద్దరు కానిస్టేబుల్స్ ఒక పెట్టెను మోసుకొచ్చి హాల్లో గోడవారగా పెట్టారు. ఇన్‌స్పెక్టర్ నాయర్ పెట్టె తాళాన్ని పగలగొట్టి తెరిచాడు.

పైన న్యూస్ పేపర్లు వున్నాయి. న్యూస్ పేపర్లను పైకి తీసి పక్కన పడేశాడు. నోట్లకట్టలు పేర్చబడి వున్నాయి.

"నాయర్ భాయ్, లెక్కపెట్టి చూడు!"

నాగూనీ, అతనితో వున్న స్త్రీనీ యిద్దరు కానిస్టేబుల్సు హాల్లోకి తీసుకొచ్చి, గోడవారగా నిలబెట్టారు.

ఇన్‌స్పెక్టర్ నాయర్ పెట్టెను మూసేశాడు. నా దగ్గర కొచ్చాడు.

"బ్రదర్, తొమ్మిదిలక్షల ఎనభైవేలుంది!" అన్నాడతను.

"ఇరవై వేలు వాళ్ళు ఖర్చుచేసి వుంటారు," అన్నాను.

టైమ్ చూశాను. పన్నెండయింది.

"బ్రదర్, ఇదంతా విచిత్రంగా వుంది. వాళ్ళు ఇక్కడ డబ్బును పాతిపెట్టారని నువ్వెలా తెల్సుకున్నావు?" అడిగాడు నాయర్, నా పక్కన చతికిలబడుతూ.

"నాయర్, నీ కంతా చెప్తేగాని యిది అర్థంకాదు," అని రాధనూ, గోపీనాథ్‌నీ అతనికి పరిచయం చేశాను.

రాధ చూసిన మొదటి శవాన్నిగురించి చెప్పాను.

"నాయర్ భాయ్, ఎలాగైనా యీ యిల్లు వదిలి వాళ్ళు పోయేటట్లు చేయాలని నాగూ ఆమెను భయపెట్టాడు. రక్తంతో ఎర్రబడిన శవాల్ని చూసి రాధ భయపడింది!

కాని, అవి శవాలు కావు. మనిషిలా తయారుచేసిన బొమ్మలు! నాగూ బొమ్మల్ని శవాల్లా ఆమెకు చూపించే వాడు! అవి నిజంగా శవాలనుకుని ఆమె భయపడేది.

ఈ యిల్లు వదిలిపోదామని భర్తతో చెప్పింది. అతను నా సలహా అడిగాడు. అద్దెకివ్వమన్నాను, కాని వేరే యిల్లు తీసుకోవద్దన్నాను. హోటల్లో గది తీసుకుని వుండమన్నాను! అలాగే చేసారు గోపీనాథ్! నాగూ వెంటనే బొంబాయి సేటుగా రూపుదాల్చి వచ్చి ఇల్లు అద్దెకు తీసుకున్నాడు'' చెప్పాను జరిగింది.

''ఈ ఇల్లు నాగూ అద్దెకు తీసుకుంటాడని మీరెలా ఊహించారు?'' అడిగాడు గోపీనాథ్.

''నాగూ పెద్ద పొరబాటు చేశాడు. అతను కర్నల్ కామత్ గా నటిస్తూ ఎదటి యింట్లో వుండేవాడు. తను రిటైరయినట్లు నాతో చెప్పాడు. నేను మేజర్ జనరల్ పృథ్వీరాజును కలుసుకుని, కర్నల్ కామత్ యింకా సర్వీసులో వున్నాడని తెల్సుకున్నాను! దాంతో కర్నల్ కామత్ యింట్లో వుండే అతను కామత్ కాదని తేలింది! అయితే అతను ఎవరు?'' అని ఆగాను.

సిగరెట్ వెలిగించాను. పొగ వదుల్తూ అందరివైపూ చూశాను. నేను ఏం చెప్తానా అని వాళ్ళు యెదురు చూస్తున్నారు!

''కొంత రిసెర్చి నేను చేయవలసి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ నాయర్ ఆఫీసులో కూర్చుని పాత ఫైళ్ళు, ఫోటోలు చూశాను. కర్నల్ కామత్ గా నటించిన నాగూను వెంటనే పోల్చగల్గాను. ఆరేళ్ళ క్రితం ప్రచురించిన హిందూ కాపీలను తిప్పి చూశాను. అంతా నాకు

అర్థమైంది. రాధ వుండే యిల్లు నాగూకి యెందుకు కావాలో నాకు అర్థమైంది!

"ఆరేళ్ళ క్రితం నాగూ, మస్తాన్, విలియమ్ యీ ముగ్గురూ కలిసి పట్టపగలు భారత్ బాంకిమీదకు దాడి చేసి, పదిలక్షల రూపాయిల రొక్కాన్ని పట్టుకు పారి పోయారు. వాళ్ళు ముగ్గురూ ఈ యింట్లో దాక్కున్నారు. అప్పట్లో యీ యింటికి తాళంవేసి వుండేది. అద్దెకు తీసు కున్నట్లు నటిస్తూ, వాళ్ళు ముగ్గురూ యిక్కడుండేవారు. ఎలాగో యీ యిల్లు పోలీసులకు తెలిసింది. అంతకుముందే వాళ్ళు పెట్టెను తోటలో పాతిపెట్టారు. పోలీసులు వాళ్ళను అరెస్టుచేశారు, కాని డబ్బు దొరకలేదు.

"వాళ్ళకు ఆరేళ్ళ కఠినశిక్ష పడింది. మస్తాన్, విలియమ్ జైల్లో మరణించారు. నాగూ జైల్లోంచి బయటకొచ్చి రెండు నెలలు అయింది. తనకు కావలసిన యిల్లును ఎవరో కొనుక్కుని అందులో నివసిస్తున్నారు.

"ఇల్లు తనచేతిలో వుంటేగాని తవ్వడం వీలుకాదు! ఇప్పుడు డబ్బంతా తనదే! కర్నల్ కామత్ యిల్లు ఖాళీగా వుంది. అతను కర్నల్ కామత్‌గా నటిస్తూ ఆ ఇంట్లో చేరాడు! రాధను భయపెట్టడం మొదలెట్టాడు!" అన్నాను, నవ్వుతూ.

"పెద్ద ప్లాను," అంది రాధ ఆశ్చర్యపోతూ.

—: ఐపోయింది :—